
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 20 సెప్టెంబరు 2025 | 5





సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ టీడీపీలో చేరిక

7



కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకట్రావు

ఉద్యోగుల అర్జీలను సకాలంలో పరిష్కరిస్తాం: డీఆర్వో

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగులు ఇచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులకు పీజీఆర్ఎస్ నిర్వహించారు. 16 అర్జీలు రాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని డీఆర్వో అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు పలువురు పాల్గొన్నారు.

నేడు గొల్లప్రోలు పరిధిలో 90 టన్నుల యూరియా పంపిణీ : జేడీ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొల్లప్రోలు పరిధిలో శనివారం ఉదయం నుంచి 90 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామని వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గొల్లప్రోలు మండల పరిధిలోని చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి, దుర్గాడ, ఏకే మల్లవరం గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. నిల్వలను రైతు సేవా కేంద్రాల్లో ఉంచి టోకెన్ల ద్వారా అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా పంపిణీ సాగుతుందన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరం మేరకు యూరియాను జిల్లాకు ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రైవేటు ఎరువుల దుకాణదారులు యూరియాను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకుగానీ, విజిలెన్స్ అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే ఆయా దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రైవేటు ఎరువుల విక్రయ దుకాణదారులు రైతులకు విధిగా బిల్లు ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

'దోపిడీ'కి చెక్!

- గోదావరి నీటితో అడ్డగోలుగా వ్యాపారం చేస్తోన్న వారికి షాక్
- నీటి దోపిడీకి అడ్డుకట్టపడేలా కలెక్టర్ ఆదేశాలతో స్మార్ట్ మీటర్ల బిగింపు
- ఒక్కో కంపెనీ ఎంత నీటిని వాడుతుందో లెక్కగట్టి నెల బిల్లుల వసూలు
- ఏ నెలకు ఆ నెల బిల్లులు చెల్లిస్తేనే నీటి సరఫరా కొనసాగింపు
- ఏళ్ల తరబడి కోట్లకుకోట్ల నీటి బిల్లులు ఎగనామానికి ఎట్టకేలకు చెక్
- పదేళ్ల నుంచి ఆరు కంపెనీలు రూ.45.50 కోట్లు ఎగ్గొట్టిన వైనం
- వీటిని కూడా వసూలు చేసేందుకు నివేదిక సిద్ధం చేస్తున్న అధికారులు



నీటి వినియోగం లెక్కించేలా బిగిస్తున్న స్మార్ట్‌మీటరు →



గోదావరి నీటిని అడ్డగోలుగా వాడుకుంటూ కోట్లకుకోట్లు సంపాదిస్తున్న పలు కంపెనీలు, నేతల సంస్థలకు ఎట్టకేలకు చెక్ పడింది. ఇకపై నీటి దోపిడీని అడ్డుకుని నెలనెల బిల్లులు వసూలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. నీటిని పారిశ్రామిక అవసరాలకు విక్రయించుకుంటూ ఏళ్లతరబడి దర్జాగా బాకీలు ఎగ్గొడుతున్న సంస్థల నుంచి నెలనెలా బిల్లులు వసూలు చేసేలా నీటి మీటర్లు బిగించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి స్మార్ట్‌మీటర్లను రప్పించి ట్యాంపరింగ్‌కు వీల్లేకుండా కంపెనీల వద్ద తాజాగా అమర్చారు. ఇక ఏ నెలకు ఆ నెల నీటి బిల్లు చేయకపోతే సరఫరా నిలిపివేస్తారు. మరోపక్క గత తొమ్మిదేళ్లుగా ఆరు కంపెనీలు నీటి బిల్లులు రూ.45.50 కోట్లు ఎగ్గొట్టిన నేపథ్యంలో వాటి వసూలుకు ఏ నిర్ణయం తీసుకోవాలనే దానిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ నగరాన్ని ఆనుకుని అనేక చమురుశుద్ధి, ఎరువుల పరిశ్రమలు ఉన్నాయి. అలాగే కాకినాడ పోర్టు ఉంది. ఈ పరిశ్రమలకు, పోర్టుకు వివిధ అవసరాల కోసం నిరంతరం వేల గ్యాలన్ల నీళ్ల అవసరం. ఈ నీటితో అనేక కంపెనీలు నిర్వహణ అవసరాలతోపాటు బాయిలర్లు, ట్యాంకులను కూలింగ్‌లో ఉంచేలా చర్యలు చేపడతాయి. అలాగే పోర్టుకు వచ్చీపోయే నౌకల్లో వాడకానికి, ఇతర అవసరాలకు నీళ్లు పెద్దఎత్తున అవసరం ఉంటోంది. ఈ నీటిని అనేక కంపెనీలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి కొంత శుద్ధి చేసి పరిశ్రమలు, పోర్టుకు విక్రయించి డబ్బులు సంపాదించుకుంటున్నాయి. వీటికి ప్రభుత్వ పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సామర్లకోటలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఎస్ఎఫ్‌సీఎల్‌కు పంపి అక్కడ నిల్వ చేసి, దీని నుంచి కంపెనీలకు నామమాత్రపు ధరకు విక్రయిస్తోంది. కానీ ఈ నీటిని సదరు కంపెనీలు పెద్దగా శుద్ధి చేయకుండా రెట్టింపు ధరకు అమ్ముతూ ఏటా కోట్లలో సంపాదిస్తున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే కిలో లీటర్‌కు రూ.10 చొప్పున ప్రభుత్వం విక్రయిస్తే ఆ నీటిని పైపైన శుద్ధి చేసి ఆ కంపెనీలు రూ.30కిపైగా ధరకు పరిశ్రమలకు అమ్ముకుంటున్నాయి. ఇలా ఒక్కో కంపెనీ నెలకు నీటి విక్రయాల ద్వారా రూ.40 లక్షల వరకు లాభాలు పొందుతున్నాయి. కానీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన నీటి ఛార్జీలు మాత్రం కట్టడం లేదు. పైగా ఈ కంపెనీల నిర్వాహకులు రాజకీయ నేతలు కావడంతో అధికార బలానికి భయపడి అధికారులు సైతం ఏళ్ల తరబడి ఈ బాకీలను వసూలు చేయడం మానేశాయి. దీంతో తమను అడిగే నాథుడు లేడనే ధీమాతో గోదావరి ముడి నీటిని ఇవన్నీ యథేచ్ఛగా వాడేసుకుంటూ కోట్లకు కోట్లు సంపాదించుకుంటున్నాయి. అయితే ఇవన్నీ పదేళ్లుగా పేరుకుపోయి రూ.44.50 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి చెందిన అంజనీ ఏజన్సీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.13.84 కోట్లు, మరో సంస్థ అన్నపూర్ణ మెరైన్స్ రూ.9.12 కోట్లు, మాజీ ఎమ్మెల్యే ముత్తా గోపాలకృష్ణకు చెందిన ముత్తా శశిధర్ అండ్ కో కంపెనీ రూ.2.73 కోట్లు, అశోకా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ రూ.5.39 కోట్లు, నాగార్జున ఎరువుల కర్మాగారం రూ.1.47 కోట్ల బాకీలు చెల్లించకుండా ఏళ్లతరబడి నీటిని వాడుకుంటున్నాయి.

నోటీసులు ఇచ్చినా..

అయితే గత నెలలో అధికారులు ఈ సంస్థలన్నింటికి నోటీసులు జారీచేసి బాకీలు చెల్లించాలని హెచ్చరించాయి. కానీ యథావిధిగా బేఖాతరు చేశాయి. ఆ తర్వాత అధికారులు సైతం మౌనం వహించారు. ఈ తరుణంలో ఈ కంపెనీల నీటి దందాపై 'చెల్లింపులకు నీళ్లు' అంటూ గత నెల 19న ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో కంపెనీల తీరుపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం నీటి సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో నాగార్జున సంస్థ బాకీలు చెల్లించింది. కానీ మిగతా సంస్థలు ఖాతరు చేయలేదు.

స్మార్ట్‌మీటర్లతో చెక్...

కంపెనీల నీటి దోపిడీని ఎలాగైనా అరికట్టాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ కొన్నివారాల కిందట అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక పక్క పాత బాకీలు చెల్లించకుండా, మరోపక్క ఇప్పటికీ నీటిని పొందుతున్న కంపెనీల ఆగడాలకు చెక్ పెట్టాలని ఆదేశించారు. అందులో భాగంగా ఇకపై ప్రతినెలా వాడే గోదావరి నీటికి బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో స్మార్ట్‌మీటర్లు బిగించి ఏరోజు ఏ కంపెనీ ఎంత గోదావరి నీటి వాడారో లెక్కించాలని నిర్ణయించారు. ఇన్నేళ్లుగా అసలు తీసుకుంటున్న నీటిని పక్కా లెక్కలు లేకపోవడం దారుణం అని, ఇక నుంచి అలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో రూ.7 లక్షలు వెచ్చించి హైదరాబాద్ నుంచి స్మార్ట్‌నీటి మీటర్లను రప్పించారు. వీటిని ఇటీవల నీటి వ్యాపారం చేస్తోన్న కంపెనీలకు బిగించారు. ఏరోజు ఎంత నీటిని వాడారో పక్కాగా లెక్క నమోదయ్యేలా రీడింగ్ తీస్తున్నారు. నెల ముగిసేసరికి ఠంఛనుగా బిల్లు చెల్లించేలా కొత్త నిర్ణయం అమల్లోకి తెచ్చారు. ఒకవేళ బిల్లు చెల్లించకుంటే నీటి సరఫరా నిలిపివేస్తామని కూడా ఆయా కంపెనీలకు స్పష్టం చేశారు. మరోపక్క కంపెనీలు నీటి మీటర్లను ట్యాంపరింగ్ చేయడానికి వీల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దీంతో ఇప్పుడు గోదావరి నీటిని వాడుకుంటున్న ఆయా కంపెనీలు బిల్లులు ఎగ్గొట్టే అవకాశం లేకుండా నెలనెలా డబ్బులు చెల్లించి తీరాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా పేరుకుపోయిన రూ.45.50 కోట్లకుపైగా బాకీలను ఎలాగైనా వసూలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం నివేదిక తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. తద్వారా వీటిని వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వసూలు చేయాలా? లేదంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఏంటి? అనేది తేల్చనున్నారు.

సోలార్ ప్లాంట్ల గ్రౌండింగ్ వేగంగా చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల మంజూరు, గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి రాష్ట్రంలో కాకినాడ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ మాసాంతానికి జిల్లాలో వివిధ రంగాలకు, ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు రుణాల కల్పనపై సమీక్షించారు. గత జూన్ మాసాంతానికి జిల్లాలో వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రుణాలుగా రూ.1855 కోట్లు, టర్మ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాన్సిలరీ రుణాలుగా రూ.2,384 కోట్లను రైతులకు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర సగటుతో పోల్చితే జిల్లాలో పంట రుణాల కల్పనలో కొంత వెనుకబాటు ఉందన్నారు. రానున్న మూడు మాసాల్లో పంట రుణాలను మరింత ముమ్మరం చేయాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో 26,220 మంది కౌలు రైతులకు ఇప్పటివరకు రూ.121.40 కోట్ల పంట రుణాలు ఇచ్చామన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు రూ.2,325 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.102 కోట్లు పంపిణీ చేశామన్నారు. 12,429 డ్వాక్రా సంఘాలు ఉండగా డీఆర్డీఏ ద్వారా 3,912 సంఘాలకు రూ.276 కోట్లు రుణాలు ఇచ్చారన్నారు. మెప్మా ద్వారా 1,023 పట్టణాల్లో సంఘాలకు రూ.154 కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ చేశారన్నారు. 2,967 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.42 కోట్లు ఇచ్చామన్నారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా 724 మంది వృత్తి పనివార్లకు లక్ష నుంచి రెండు లక్షల వరకు రుణాలు పంపిణీ చేశామన్నారు. పీఎంఈజీపీ ద్వారా 23 యూనిట్లకు రూ.1.91 కోట్లు ఉపాధి రుణాలు కల్పించామన్నారు. పీఎం సూర్యఘర్ ద్వారా 5,537 దరఖాస్తులు అందగా 2087 దరఖాస్తులకు రూ.32.77 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. వివిధ పథకాల్లో రూ.1674కోట్లు నిరర్థక ఆస్తులుగా పేరుకుపోవడంపై బ్యాంకర్లు ఆందోళన వ్యక్తంచేశారు. బకాయిల వివరాలను తనకు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. కమిటీల కన్వీనర్, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ బీజీఆర్ నాయుడు, ఆర్‌బీఐ ఎల్డీవో నవీన్, ఎల్డీఎం ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజరు గణపతి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసు, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా మత్స్యశాఖాధికారి కృష్ణారావు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

సాంకేతికత, కీలక విషయాలపై పోలీసులకు శిక్షణ

కాకినాడ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికత, కీలక విషయాలపై శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఒకరోజు కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆధునిక సాంకేతికత, డాక్యుమెంటేషన్ విధానాలు, కోర్టు బాధ్యతలపై అవగాహన పెంపొందిస్తామన్నారు. వారి పనితీరును మరింత సమర్థవంతంగా మార్చడం ద్వారా పోలీసుశాఖ మొత్తం పనితీరులో మెరుగుదల తీసుకొస్తామన్నారు. ముఖ్యంగా కార్యాలయ నిర్వహణలో నాణ్యతను పెంచడం కీలక అంశమన్నారు. తద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు దోహదపడుతుందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారి వరకు అలసత్వం లేకుండా అంకితభావం, పారదర్శకతతో విధులు నిర్వర్తించడం ద్వారా పోలీసుశాఖ నాణ్యతతో కూడిన మెరుగైన సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు. ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాశేఖర్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆర్.రవికుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈఎస్ఐలో నమోదు చేసుకోవాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది, కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులు విధిగా ఈఎస్ఐలో పేరు నమోదు చేయించుకోవాలని ఈఎస్ఐ బ్రాంచి మేనేజరు శ్రీనివాసరావు కోరారు. కాకినాడ కలెక్టరేట్లో శుక్రవారం ఈఎస్ఐపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా చట్టం కింద నమోదైన కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు ఉపయోగపడుతుందన్నారు. ప్రమాదాలకు గురైనప్పుడు, మరణించినప్పుడు ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. ఈ పథకం ద్వారా అన్ని రకాల వైద్య సాయం చేస్తారన్నారు. ఇతర బీమా సంస్థల్లో ఉన్నట్టే బీమా స్వభావం కార్మిక రాజ్య బీమా చట్టంలో ఇమిడి ఉందన్నారు. ఇతర బీమా సంస్థల్లో ఒక్కటే చందాకు ఒక్క ప్రయోజనం మాత్రమే చేకూరుతుందన్నారు. కానీ ఈఎస్ఐలో ఒకే చందా ద్వారా బహుళ ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఈ చట్టం అన్ని పరిశ్రమల్లో కార్మికులతోపాటు వార్తా పత్రికలు, సినిమా హాళ్లు, రవాణా సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసే వారికి వర్తిస్తుందన్నారు. ఈ చట్టంలోకి చేరే వారు వెబ్ పోర్టల్స్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఈఎస్ఐ బ్రాంచి మేనేజరును 94414 05622 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

నేరాల కట్టడికి డ్రోన్ కెమెరాలతో నిఘా



కాకినాడ జగన్నాథపురం వంతెన వద్ద డ్రోన్ కెమెరా నిఘా

కాకినాడక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ నేరాలను కట్టడి చేయడంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, మద్యం తాగి వాహనాలు నడపడం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు జిల్లావ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో నిఘాను నిరంతరం కొనసాగిస్తున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి కాకినాడ మెయిన్‌రోడ్డు, జగన్నాథపురం, సర్పవరం, పెదపూడి, పిఠాపురం, ఇంద్రపాలెం, పోర్టు, కరప, సామర్లకోట, జగ్గంపేట, ప్రత్తిపాడు, అన్నవరం, తుని, తొండంగి, పెద్దాపురం, కిర్లంపూడి, గండేపల్లి, ఏలేశ్వరం, రౌతులపూడి, కోటనందూరు ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల నిరసన

కాకినాడలో దస్తావేజు లేఖరుల నిరసన

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2.0 విధానంలో ఎదురవుతున్న లోపాలను సరిదిద్దాలని రాష్ట్రవ్యాప్త పెన్‌డౌన్ సమ్మెలో భాగంగా శుక్రవారం కాకినాడలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కాకినాడ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు ఆధ్వర్యంలో లేఖరులు నిరసన తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడు బీజే ప్రసాద్, నగర అధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో తగు మార్పులు చేసి, ఆధార్ అప్‌డేట్‌ను ఫోన్ లింకప్ చేసి ఏ విధమైన జాప్యం లేకుండా చేయాలన్నారు. పీడీఈ విధానంలో లోపాలను సరిదిద్దాలని, ఎడిట్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌లకు ఇవ్వాలన్నారు. ఆందోళనలో నగర కార్యదర్శి గీసాల శ్రీనివాసరావు, కోశాధికారి వీవీవీ సత్యనారాయణ, సీనియర్ సభ్యులు జాడ అప్పలరాజు, మోహనరావు, పీఎస్ ప్రసాద్, గంగాపాత్రుని కృష్ణ, గాయత్రి శ్రీను, రామలింగం, మహేష్ పాల్గొన్నారు.



కాకినాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కాకినాడలో ఏఐఎస్ఎఫ్ ధర్నా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. జిల్లా కన్వీనర్ ముమ్మిడి సతీష్‌బాబు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బన్నీ, సురేష్, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇంట్ర'స్టుగా..

- పేదల ఇళ్లపై కూటమి సర్కారు దృష్టి
- జోరుగా పీఎంఏవై ఫేజ్-1 నిర్మాణాలు
- దసరాకు ప్రారంభించే ప్రయత్నం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ఫేజ్-1 ద్వారా ఇళ్లు మంజూరైన గృహ నిర్మాణ లబ్ధిదారులతో నూతన గృహ ప్రవేశం చేయించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిన ఈ ఇళ్లను పూర్తిచేసేలా ఇప్పటికే ఆదేశాలిచ్చిన ప్రభుత్వం.. నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చూస్తోంది. గత ప్రభుత్వంలో కనీసం 25 శాతం కూడా పూర్తి చేయలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిపై దృష్టి సారించింది. నాటి ప్రభుత్వంలో ఎంత మంది నిర్మించుకున్నారు?, ఎంతమంది నిర్మించుకోలేదు?, అసంపూర్తిగా ఉన్న ఇళ్లు ఎన్ని? అవి ఏయే దశలో నిలిచిపోయాయి? వంటి వివరాలను కూటమి ప్రభుత్వం సేకరించింది. ఆ ఇళ్ల నిర్మాణాలపై దృష్టిసారించి లబ్ధిదారులకు ఆర్థికంగా చేయూతనందించింది. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా మొత్తం 75,718 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 33,486 గృహాలు పూర్తయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం అర్బన్‌లో సెంటు స్థలం, గ్రామీణంలో సెంటున్నర స్థలాన్ని పేదలకు పంపిణీ చేసింది. పట్టణ అభివృద్ధి సంస్థ పరిధిలో, పట్టణ పరిధిలో, గ్రామీణ ప్రాంతంలో ఎక్కడ ఇల్లు నిర్మించుకున్నా.. అప్పట్లో కేంద్రం ఈ ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చింది. ఇందులో అప్పట్లో జగన్ సర్కారు రాష్ట్రం వాటా రూ.30 వేలు మాత్రమే. దీంతో కొంత మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఇంతలో ఎన్నికలు రావడం.. వైసీపీ ఓడిపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అయోమయంలో పడింది. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా నిలిచిన గృహాలపై దృష్టి సారించింది. దసరా నాటికి 11,769 ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది. అందులో 6895 ఇళ్లను పూర్తి చేశారు. మరో 4,874 వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని కూడా పూర్తి చేసేలా అధికారులు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనులు పర్యవేక్షిస్తున్నారు. కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలైన కాకినాడ సిటీ, రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడుతో పాటు అనపర్తి, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షణ డీఈ, ఏఈ స్థాయి అధికారులకు అప్పగించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించాలనే ప్రభుత్వ లక్ష్యంతో పనిచేస్తున్నాం. గృహ నిర్మాణాలు ఆశించే స్థాయిలోనే జరుగుతున్నాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తూ సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. దసరాకు 6895 ఇళ్ల గృహ ప్రవేశాలు జరిపించే ప్రయత్నం చేస్తున్నాం" అని అన్నారు.

జిల్లాలోని నియోజకవర్గాల్లో పీఎంఏవై ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఇలా..

నియోజకవర్గం	మొత్తంఇళ్లు	పూర్తయినవి
అనపర్తి(పెదపూడి)	3264	1372
జగ్గంపేట	5341	3734
కాకినాడ సిటీ	16438	3549
కాకినాడ రూరల్	10486	3959
ముమ్మిడివరం(తాళ్లరేవు)	2426	1709
పెద్దాపురం	8733	4923
పిఠాపురం	8525	5041
ప్రత్తిపాడు	7145	4239
రామచంద్రపురం(కాజులూరు)	1575	553
తుని	11785	4407



బండరాళ్లతో అలలకు అడ్డుకట్ట

- ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- గోతుల రహదారికి మరమ్మతుల మాటేంటి?

7



గురువుల.. గోకవరం



మారుమూల మండలం ..30 మంది ఉపాధ్యాయులు

- పట్టుదలతో చదివి..సాధించారు
- అంతా సర్కారు బడిలో చదివినవారే
- రంపయర్రంపాలెం నుంచి 11 మంది
- మల్లవరం నుంచి 9 మంది ఎంపిక

(గోకవరం- ఆంధ్రజ్యోతి)

పట్టుదల ఉంటే కానిది లేదు.. లక్ష్యం ఉంటే సాధించలేనిది లేదని.. సౌకర్యాల్లేకపోవడం ఆటంకం కాదని నిరూపించారు.. గోకవరం మండలానికి చెందిన నిరుద్యోగ యువత.. ఎందుకంటే ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఆ ఒక్క మండలం నుంచే సుమారు 30 మంది ఎంపిక య్యారు. శ్రమనే ఆయుధంగా నమ్ముకున్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడినా లెక్క చేయలేదు. చివరకు వారు కన్న కలలను సాధించుకున్నారు. మల్లవరం గ్రామం నుంచి సుమారు 30 మంది, రంపయర్రంపాలెం నుంచి 25 మంది డీఎస్సీ పరీక్షకు హాజరుకాగా, మల్లవరం నుంచి 9 మంది, రంపయర్రంపాలెం నుంచి 11 మంది ఎంపికయ్యారు. పలువురిని మొదటి ప్రయత్నంలోనే అదృష్టం వరించగా.. మరికొందరు నాలుగైదు సార్లు ప్రయత్నించి ఉద్యోగాలు సాధించారు.

సర్కారు బడిలో చదివినా..

అది ఒక మారుమూల మండలం.. ఏజెన్సీ సరిహద్దు మండలం.. కార్పొరేట్ స్కూల్స్ అంతగా లేని మండలం.. అయినా ఆ మండలానికి చెందిన అభ్యర్థులు డీఎస్సీలో తమ ప్రతిభ చాటారు.. వారిలో 90 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే. అయినా ఏకంగా ఒక్క మండలం నుంచే సుమారు 30 మంది వరకూ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మల్లవరం గ్రామం మండల కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్లు.. జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే అడవిలో ప్రయాణించాల్సిందే. అటువంటి గ్రామం నుంచి ఏకంగా 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండల కేంద్రానికి 4 కిలోమీటర్లు దూరంలో ఉండే రంపయర్రంపాలెం నుంచి ఏకంగా 11 మంది డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు.



విజేతలు వీరే...

మల్లవరం నుంచి ఆడిదం సూరిబాబు, గంటా వీరవిష్ణు, గోకాడ గౌరీదేవి, పడాల రమేష్, ఈడుగుల రాజబాబు,దిమ్మితి శామ్యూల్‌రాజు, మండపాక రాజేశ్వరి, మెరిసే సూర్యం, పల్లెల వీరలక్ష్మి టీచర్లుగా ఎంపికయ్యారు. రంపయర్రంపాలెం నుంచి ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్, బోయిడి సత్యశ్రీ, నవనాసి వీరవిష్ణు, కర్రి సురేష్, నాగవల్లి వెంకటరమ్య, కొండా జయరాందాస్, నాగవల్లి మురళీ శివ బాలకృష్ణ, యామానపల్లి ప్రేమ సౌందర్య, నాగవల్లి శ్రీదేవి, కె.సత్యవతి, గుబ్బల స్వాతి ఎంపికయ్యారు. దేవీపట్నం మండలం పూడిపల్లికి చెందిన దేవిశెట్టి దివ్య ప్రభది పోలవరం పునరావాస కాలనీ. ప్రస్తుతం గుమ్మళ్లదొడ్డిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉంటోంది. 92.04 మార్కులతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 4వ ర్యాంకు సాధించింది.

నాకు వినపడదు.. గోడకు స్పీకర్లు ఏర్పాటు చేసుకుని డీఎస్సీకి ప్రిపర్ అయ్యా..



చాలా కాలం కిందట పొలంలో పాము కాటుకు గురయ్యా. ఆ తరువాత కొంతకాలానికి పాము కాటు ప్రభావం వల్ల ఇన్ఫెక్షన్‌కు గురై చెవులు పని చేయడం మానేశాయి. చాలా నిరాశకు గురయ్యా. ప్రైవేట్ పనులకు వెళితే వినపడడం లేదని పంపేసేవారు. ఆ సమయంలో డీఎడ్ పూర్తి చేశా. కోచింగ్ కోసం అవనిగెడ్డ వెళ్లా.. కానీ అక్కడ వారు చెప్పేది నాకు వినపడేదికాదు. దీంతో తిరిగి మాస్వగ్రామం వచ్చేశా. నా స్నేహితుడి సలహాతో ఎస్‌అండ్‌ఎస్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌కి బ్లూటూత్ అనుసంధానం చేసి తద్వారా గోడకు స్పీకర్లు ఏర్పాటు చేసుకుని డీఎస్సీకి సిద్ధమయ్యా. పోస్టుకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వం నా భవిష్యత్‌కు బాటలు వేసింది.

- ఆడిదం సూరిబాబు, మల్లవరం, గోకవరం మండలం



30 మంది ఎంపికవ్వడం ఆనందంగా ఉంది..

గోకవరం మండలం నుంచి 30 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవ్వడం ఆనందంగా ఉంది.. గతంలో నేను ఇక్కడ ఎంఈవోగా పనిచేసి రిటైర్డ్ అయ్యా. అందుకే డీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులను ప్రోత్సహించా. డీఎస్సీకి ఎంపికైన వారిని చూస్తుంటే గర్వంగా ఉంది. ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవమైనది.

- కంటే ఉదయభాస్కర్ చౌదరి, రిటైర్డ్ ఎంఈవో, గోకవరం



విద్యార్థినులు తయారుచేసిన ఆహారాన్ని రుచి చూస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

ఆహారంలో.. ఆరోగ్యం!

కిచెన్ కెమిస్ట్రీపై 'నన్నయ'లో వర్క్‌షాప్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నిరకాల పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యంతో జీవించవచ్చునని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళలకు పోషకాహారం (కిచెన్ కెమిస్ట్రీ)పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఆరోగ్యానికి అవసరమైన పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో శ్రద్ధ వహించాలని చెప్పారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవడమే లక్ష్యంగా ఈసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ చైర్మన్ ప్రొఫెసర్ వి.పీసపాటి మాట్లాడుతూ మన ఇంట్లో ఉండే వంటగది పదార్థాలతోనే రసాయన శాస్త్ర సూత్రాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకోవడం, వంటచేసేటప్పుడు కలపడం, వేడిచేయడం, చల్లబరచడం వంటి చర్యలు ద్వారా పదార్థాలు ఎలా మారతాయో తెలపడమే కిచెన్ కెమిస్ట్రీ అన్నారు. కిచెన్ కెమిస్ట్రీలోని వివిధ అంశాలను వివరించి సహజాహారం, పోషక విలువలపై అవగాహన కల్పించారు. చాక్లెట్ తయారీపై పీవీ లక్ష్మి ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. అనంతరం మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల ప్రదర్శన పోటీలో విద్యార్థులు డ్రైఫ్రూట్స్ మిక్చర్, సున్నుండలు తదితరాలను సిద్ధం చేశారు. అతిథులు, న్యాయనిర్ణేతలు వాటిని రుచి చూసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాలుండే.. సొరకాయ అప్పాలు



వరిపిండి, సొరకాయ, నువ్వులు, పచ్చిమిరపకాయలు, ఉప్పు, నూనెను ఉపయోగించి సొరకాయ అప్పాలు చేశాం. సొరకాయని ముందుగా తురుముకుని వేయించాలి. నువ్వులను బాగా దోరగా వేయించి ఈ రెండింటినీ వరిపిండిలో వేసి ముద్దగా కలుపుకుని నూనెలో వేయించాలి. వీటిలో ఐరన్, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్లు, కేలరీలు వంటి పోషక విలువలు ఉంటాయి. వీటిని టమోటా చట్నీతో కలుపుకుని తింటే రుచికరంగా ఉంటాయి.

- కె.దుర్గాదేవి, ఎస్‌కేడీ భవానీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ

ఆరోగ్యాన్నిచ్చే..రూట్ వెజిటబుల్ బౌల్..



బీట్‌రూట్, క్యారట్, పెరుగు, ఆవాలు, కరివేపాకు, జీలకర్ర ఉపయోగించి తయారు చేసే ఈ రూట్ వెజిటబుల్ బౌల్‌తో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలున్నాయి. బీట్‌రూట్‌ని 10 నిమిషాలు ఉడకబెట్టాలి. ఆ తరువాత మరో 10 నిమిషాల పాటు చల్లార్చి తురుముకుని ఒక పాత్రలో వేసుకుని తగినంతపెరుగుతో బాటు కొంచెం ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకుని దానికి తాళింపు జతచేయాలి. ఈ బీట్‌రూట్ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వేసుకుని కొత్తిమీరతో అలంకరించుకోవాలి.

- కె.ప్రియాంక, ఎన్.జ్యోతిర్మయి, ఎంఎస్సీ విద్యార్థినులు



విద్యార్థినులు తయారుచేసిన ఆహారాన్ని రుచిచూస్తున్న న్యాయనిర్ణేతలు

ఎముకలకు బలం.. స్టఫ్డ్ బీరకాయ



ఆహారంతో ఆరోగ్యం లభిస్తోంది.. మన పూర్వీకులు వందేళ్లు బతకడమే అందుకు ఉదాహరణ. సరిగా వండుకుంటే ప్రతి కూరా ఔషధమే. బీరకాయతో తయారు చేసిన ఈ వంటకంలో వాడేపదార్థాల వల్ల కాల్షియం ఉండి ఎముకలకు బలాన్నిస్తుంది. బీరకాయ, నువ్వులు, వేరుశనగ గుళ్ళు, ధనియాలు, జీలకర్ర, నెయ్యిని ఈ వంటకం కోసం వాడా. ఈ వంటకం తినడం వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు, విటమిన్ బి1, బి2 , బి5, బి6, ఇ, కె లభిస్తాయి. చాలా ఆరోగ్యకరమైనది.

- పి.స్నేహ. సివిల్ ఇంజనీరింగ్

శ్రీపీఠంలో మూడోసారి మహాశక్తి యాగం

- వంద కోట్ల కుంకుమార్చన
- 36వేల మందికి ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీ
- ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు మహా క్రతువు
- స్వామి పరిపూర్ణానంద సరస్వతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠం ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం-2025 మహా క్రతువును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు శ్రీపీఠం నిర్వాహకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం వెనుక గల మహాశక్తి యాగం ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు 11 రోజులు జరిగే మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన లక్ష్యంగా భక్తులు పాల్గొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం సుమారు 36వేల మంది భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా, 6వేల మంది నేరుగా పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. శ్రీపీఠంలో మహాశక్తి యాగాన్ని ఇప్పటికే రెండు పర్యాయాలు విజయవంతంగా నిర్వహించి, రెండు వందల కోట్ల సహస్రనామ కుంకుమార్చనలు పూర్తి చేశామన్నారు. వంద కోట్ల కుంకుమార్చనతో పాటు సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్న సుమారు 120 మంది రుత్వికుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

లక్ష పసుపు, నిమ్మకాయ, కొబ్బరికాయలతో అర్చన చేస్తామన్నారు. మాతృమూర్తి సంకల్పం మేరకు ఆమె దాచుకున్న సొమ్ముతో పాటు అమెరికాకు చెందిన భక్తుల సహకారంతో ఈ క్రతువులో పాల్గొన్న భక్తులకు రాగితో తయారుచేసిన ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. నిత్యం 40 నుంచి 45 వేల మందికి అన్నప్రసాదం పంపిణీకి 70 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 4 లక్షల మందికి అమ్మవారి ప్రసాదం పంపిణీ, ఇతర వాటికి సుమారు 3,400 మంది సేవలు అందిస్తారన్నారు. ఉదయం 6.30 గంటలకు హోమాలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు లలితా సహస్రనామంతో కుంకుమార్చన ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేస్తామని స్వామి వివరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి



రాష్ట్రస్థాయి ఆర్చరీ అండర్-19 పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు 24 మంది ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక కోసం గురువారం పోటీలు నిర్వహించారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 95 మంది ఆర్చర్లు పోటీపడ్డారు. వారి ప్రతిభను పరిశీలించిన అనంతరం బాలబాలికల్లో రికర్వ్, ఇండియన్ రౌండ్, కాంపౌండ్ విభాగాల్లో 24 మందిని ఎంపిక చేశారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మూర్తి, ఇమ్మానుయేల్, కె.చిన్నబ్బాయి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, ఉమ్మడి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి, మాజీ సెక్రటరీ శివరామకృష్ణ పర్యవేక్షించారు.



ఎంపిక పోటీల్లో సత్తా చూపుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చర్లు



నార్త్ జోన్ చాంపియన్‌గా నిలిచిన అండర్-23 జట్టు సభ్యులు

నార్త్ జోన్ అండర్-23 చాంపియన్ తూర్పు గోదావరి

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు జరిగిన నార్త్‌జోన్ అండర్-23 మెన్ మల్టీ డేస్ మ్యాచెస్‌లో నాలుగు జిల్లాలు పోటీపడ్డాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. మూడు ఇన్నింగ్స్‌లో కెప్టెన్ బండారు సుజన్ 69 (నాటౌట్), 138, 30 (నాటౌట్), వైస్ కెప్టెన్ టీవీ సాయిశ్రవణ్ 148, 83, 191, కేఎస్ జయంత్ 55, 30, 167, టి.మురళీకృష్ణ 30, 41, 106 పరుగులు సాధించారు. బౌలర్లు యు.సందేశ్, వి.గిరిప్రసాద్, పి.వంశీనారాయణ, నాగేంద్రబాబు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి జట్టు విజయానికి తమ వంతు సహాయపడ్డారు.

టీం సభ్యులను, కోచ్ హకీమ్ పాషాను రంజీ మాజీ ప్లేయర్ రఫీ అహ్మద్ కిద్వాయ్, తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ శ్రీపతి, కార్యదర్శి నక్కా వెంకటేష్ అభినందించారు.





దుర్గాడలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి మూలవిరాట్టుపై ప్రసరించిన సూర్యకిరణాలు, అరుణ వర్ణంలో స్వామివారు

ఉమారామలింగేశ్వరస్వామికి అరుణకిరణ స్పర్శ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆలయంలో కొలువైయున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. శుక్రవారం సాయంత్రం అరుణకిరణ స్పర్శతో స్వామి, అమ్మవార్లు అరుణ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామలింగేశ్వరస్వామిని చూసి తన్మయత్వానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ప్రత్యేక పూజలు జరిపారు.

వచ్చే నెల 1 నుంచి రాజమండ్రి-తిరుపతి విమాన సర్వీసు

ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ వెల్లడి

కోరుకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి విమానాశ్రయం నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు విమాన సర్వీసులు ఇప్పటికే నడుస్తున్నాయని... అక్టోబరు ఒకటో తేదీ నుంచి రాజమండ్రి-తిరుపతి మధ్య విమాన సర్వీసు ప్రారంభమవుతుందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎస్కే శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు వారానికి మూడు రోజులు అందుబాటులో ఉంటుందన్నారు. ఏటీఆర్ 72 విమానం తిరుపతిలో ఉదయం 7.40 గంటలకు బయల్దేరి 9.25 గంటలకు రాజమండ్రి చేరుతుందన్నారు. ఇక్కడ 9.50 గంటలకు బయల్దేరి 11.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ సర్వీసు ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్ల పరిశీలన కోసం ఎయిర్‌లైన్స్ బృందం త్వరలో రాజమండ్రి విమానాశ్రయానికి రానుందని శ్రీకాంత్ వెల్లడించారు.

గ్రామ పంచాయతీలు సొంత ఆదాయంపై దృష్టి పెట్టాలి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయంపై దృష్టి పెట్టాలని ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పంచాయతీలకు వివిధ రూపాల్లో సొంత నిధులు సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అటువంటప్పుడు పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

22న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వికాస ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9గంటలకు కాకినాడ వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376222 నెంబరును సంప్రదించాలన్నారు.

కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సుబ్బంపేటలో బండరాళ్లతో చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు

బండరాళ్లతో అలలకు అడ్డుకట్ట





కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుడు

- ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- గోతులుగా ఉన్న రహదారికి మరమ్మతుల మాటేంటి?

కొత్తపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖఆధ్వర్యంలో కొత్తపట్నం-సుబ్బంపేట గ్రామాల మధ్య అలలకు బండరాళ్లతో అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉప్పొంగి రాకాసిఅలలు ఎగసిపడడంతో కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద బీచ్‌రోడ్డును ఆనుకుని గతంలో ఏర్పాటు చేసిన రక్షణ గట్టు పైనుంచి మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు దూసుకుపోవడం, బీచ్‌రోడ్డు కోతకు గురవడం తెలిసిందే. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులతో కోతకు గురైన బీచ్‌రోడ్డు, సముద్రపునీటిలో మునిగిన మత్స్యకార ఇళ్లను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎంకు సమాచారం తెలియజేయడంతో కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బండరాళ్లు డంప్ చేసి అలలకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రెండురోజులుగా బండరాళ్లను డంప్ చేసి కెరటాల ధాటికి అడ్డుకట్ట వేశారు. అలల ధాటికి గోతులుగా మారిన బీచ్‌రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టకపోవడంతో బైక్‌లపై ప్రయాణించే వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కార్తీకమాస ఏర్పాట్ల పురోగతిపై
అన్నవరం ఈవో సమీక్షా సమావేశం



కార్తీకమాస ఏర్పాట్ల రివైజ్డ్ సమావేశంలో పాల్గొన్న ఈవో, దేవస్థానం సిబ్బంది

అన్నవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 22నుంచి కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలకు సంబంధించి ఈనెల 5న ఈవో, చైర్మన్ సమక్షంలో ప్రవేశపెట్టిన మినిట్స్ పురోగతిపై శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పర్వదినాల్లో భక్తులు లక్షమందికిపైగా విచ్చేస్తారని అంచనా వేస్తుండగా వారికి ఎక్కడా అసౌకర్యంకలగకుండా ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్తీకమాసంలో ప్రధాన ఉత్సవాలైన గిరిప్రదక్షణ, స్వామివారి తెప్పోత్సవం తదితర వాటిపై చర్చించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. దేవస్థానం సిబ్బందితోపాటు సేవాసంస్థల సభ్యుల సేవలను వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ తేదీ నిర్ణయిస్తామని అప్పటికి విభాగ అధిపతులు తమకు నిర్దేశించినలక్ష్యాల్లో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అన్నవరంలో వివిధ లైసెన్స్ హక్కులకు బహిరంగ వేలం

అన్నవరం,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వ్యాపార లైసెన్స్ హక్కులకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం హోరాహోరీగా జరిగింది. పాత బుకింగ్ కౌంటర్ ఎదురుగా షాపింగ్‌కాంప్లెక్స్ ఒకటో నెంబరుకు గతంలోఏడాదికి రూ.81.84లక్షలుకాగా ఈఏడాది రూ.1.20కోట్లకు హెచ్చుపాట దక్కించుకున్నారు. షాపునెంబరు రెండుకు గతంలో రూ.43.56లక్షలుండగా తాజావేలంలో రూ.85.44లక్షలు, షాపు నెంబరు నాలుగుకు గతంలో రూ.43.56 లక్షలు ఆదాయం రాగా ఈఏడాది రెట్టింపు మొత్తంతో రూ.85.44లక్షలు సమకూరింది. 6వనెంబరు షాపునకు గతంలో రూ.25.80 లక్షలుండగా తాజా వేలంలో రూ.42.48లక్షలకు హెచ్చుపాటలు వచ్చాయి.

తగ్గిన టోల్‌గేట్ వసూలు లైసెన్స్ హక్కు వేలం

జ్యూస్‌పాయింట్ నిర్వహణకు స్వల్పంగానే ఆదాయం పెరిగింది. గతంలో రూ.25.08 లక్షలు ఈఏడాది రూ.25.32లక్షలకు దక్కించుకున్నారు. రత్నగిరికి వచ్చే నాలుగు, ఆరుచక్రాల వాహనాలనుంచి టోల్‌వసూలు లైసెన్స్ హక్కుకు గతంలో రూ.2.27కోట్లు ఆదాయం లభించగా రెండుసార్లు టెండర్లు పిలిచినా అంతమొత్తం చెల్లించేందుకు ఎవరూరాలేదు. దీంతో మూడోసారి నిర్వహించిన వేలంలో అత్యధికంగా రూ.1.98 కోట్లకు టెండరుదారులు మొగ్గుచూపారు. కాలపరిమితి ముగియనుండడం, రాబోయే కార్తీకమాసం దృష్టిలో ఉంచుకుని ఈ వేలాన్ని ఖరారు చేయాలని అధికారులు నిర్ణయించారు.

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ టీడీపీలో చేరిక



ఎమ్మెల్సీ పద్మశ్రీకి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు

కాకినాడసిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ శుక్రవారం టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబును ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు పద్మశ్రీ విడుదల చేసిన ఒక ప్రకటనలో వైసీపీకి రాజీనామా చేసి ఏడాది అయ్యిందన్నారు. పదవిలో ఉన్నా ప్రజలకు పెద్దగా ఏమీ చేయలేకపోయామన్నారు. వైసీపీలో తనకు కనీసం మీడియాతో మాట్లాడే అవకాశం లేకుండా పోయిందన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ పేరాబత్తుల

- తొలిసారిగా శాసనమండలిలో అడుగుపెట్టిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపిన రాజశేఖరం



చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు చెబుతున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

కాకినాడసిటీ,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా శాసన మండలిలో అడుగుపెట్టిన పేరాబత్తుల రాజశేఖరం శుక్రవారం సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

కోనసీమ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా రజనీ



పుణ్యమంతుల రజనీ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యురాలిగా భట్నవిల్లి గ్రామానికి చెందిన పుణ్యమంతుల రజనీని నియమించారు. మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న రజనీని జిల్లా కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంతో నమ్మకంతో పదవిని అప్పగించిన కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌వాదులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శివకోడు హైస్కూలు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివకోడు హైస్కూలు విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాస్

రాజోలు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలుగేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా మోరి జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయిఫెన్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగం నుంచి పైడిమర్రి ఇంద్రజ, అండర్-14 విభాగంలో బాలం ప్రణతి, వీరమల్లు చిరుతేజ ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అభినందించారు.

ఉమ్మడి జిల్లా అండర్-19 కాలేజీ గేమ్స్
జూడో పోటీలకు 16మంది ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గంపేట,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావుఅధ్యక్షతన ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. దీనికి రిఫరీగా జూడో మాస్టర్ తాండ్రోతు వీరవెంకటరమణ వ్యవహరించారు. ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా జూడో పోటీలకు ఎంపికైన 8మంది బాలురు,8మంది బాలికలు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని రిఫరీ వెంకటరమణ తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు ఎంపిక కార్యక్రమం జగ్గంపేట జూనియర్ కాలేజీలో నిర్వహించామని,ఎంపికైన వారంతా రాష్ట్రస్థాయిలో జూడోపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రిఫరీ సాయి కృష్ణ, దేవి కృష్ణ, లెక్చరర్స్ షేక్ మదీనా, సీహెచ్ రాము పాల్గొన్నారు.

ఇదిగో భోజనానికి
వచ్చేస్తున్నా..
అన్న పావుగంటకే కబళించిన మృత్యువు

- టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఢీకొన్న స్పోర్ట్స్ బైక్
- వ్యక్తి మృతి
- తొండంగిలో ఘటన

తొండంగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమారుడు నిర్వహిస్తున్న షాపు తెరిచేందుకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్ చేసి చెప్పిన పావుగంటకే మృత్యువాతపడిన సంఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు సుబ్బరాయపురం వద్ద శుక్రవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌ను స్పోర్ట్స్ బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన చిత్రాడ రాజు(50) బెండపూడి శివారు సుబ్బరాయపురంలో తన కుమారుడు తాతాజీ నడుపుతున్న పాతసామాను షాపు తెరిచేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఉదయం 6గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటలకు షాపు కట్టేసి ఇంటికి భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్‌చేసి చెప్పాడు. మరో పావుగంటలో ఇంటికి వస్తాడనుకుంటుండగా.. టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌పై రావికంపాడు వెళ్తున్న రాజును బెండపూడినుంచి అన్నవరం వైపు వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయా స్పోర్ట్స్ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రాజు కాలువిరిగి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి కుమారుడు కాసేపు అచేతనుడయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు తాతాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యానాం బాడీ బిల్డింగ్ సభ్యులతో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ పెండెం

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు పయనం

యానాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఈనెల 21వతేదీ నుంచి జరగనున్న 21వ రాష్ట్రస్థాయి ఓపెన్ లెవెల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం బాడీ బిల్డింగ్ సభ్యులు వెళ్లనున్నారు. న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఖాసీ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తామని యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా యానాం మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, పీడీ గుత్తుల మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ యానాంలో ఉన్న జిమ్‌లను ఉపయోగించుకుని బాడీ బిల్డర్లుగా మంచి ప్రతిభ కనబరచాలని కోరారు.

బారులు తీరిన ఆటోలు

- వాకలపూడి ఏడీబీ రోడ్డులో వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోల కండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు క్యూ
- వాహన మిత్ర పథకం దరఖాస్తుకు చివరి తేదీ కావడంతో హడావుడి



ఏడీబీ రోడ్డులో వెహికల్ టెస్టింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఆటోలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడి ఏడీబీరోడ్డులో ఆటోలు బారులు తీరాయి. ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోలకండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు రెండురోజులుగా జిల్లా నలుమూలల నుంచి ఆటోడ్రైవర్లు తమ ఆటోలను ఇక్కడకు తీసుకువచ్చారు. వాహన మిత్ర పథకానికి సంబంధించి బుధవారంనుంచి సచివాలయాల్లో ఆటోడ్రైవర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొంతంగా ఆటో, మోటారు, మేక్సీ క్యాబ్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారికి ఈ పథకం వర్తిస్తోంది. దరఖాస్తులకు ఆఖరుతేదీ ఈనెల 19వతేదీ శుక్రవారం కావడం, ఈనెల 24న తుది జాబితా విడుదల చేయడం, అక్టోబరు 1న అర్హత సాధించిన ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమచేయనున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు తమ ఆటోలు, వాహనాలకు బ్రేక్, ఫిట్‌నెస్ చేయించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వాకలపూడి ఏటీసీ సెంటర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు.

సర్వర్ పనిచేయక జాప్యం

రెండురోజులుగా ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్(ఏటీసీ) వద్ద ఆటోలతో కిక్కిరిసిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలతోపాటు ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేయించుకునే సమయంలో క్యూ పద్ధతి లేకపోవడం, ఆటోలన్నీ ఒకేసారి రావడంతో ఏటీసీ సెంటర్ సెక్యూరిటీ, ఆటోడ్రైవర్ల మధ్య వాగ్వాదం జరిగింది. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఫిట్‌నెస్ స్టేషన్‌లో జాప్యం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచాలని ఆటోడ్రైవర్లు కోరుతున్నారు. ట్రాఫిక్ స్తంభించడంతో తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



స్మార్త రత్న అవార్డు అందుకుంటున్న వలబోజుల రాకేష్

యువకుడికి స్మార్త రత్న అవార్డు

చింతూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మ స్మార్తరత్న అవార్డు అందుకున్నారు. తమిళనాడు కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ హిందూ దేవాలయాలు ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ వారు అంతర్జాతీయ ఆరో ఆధ్యాత్మిక జ్యోతిష సదస్సును తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వేదపండితులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మకు స్మార్తరత్న అవార్డు దక్కింది. అవార్డు ఎంపిక తెలంగాణ కేంద్రంగా నిర్వహించిన నేపథ్యంలో రాకేష్‌కు అంతర్జాతీయ హిందూ దేవాలయాలు, ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ తెలంగాణ ఐకానిక్-2025 పేరిట అవార్డును వేదపండితుల సమక్షంలో నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో అత్తలూరి బాలశంకరశాస్త్రి, జోనోజు పరిపూర్ణాచార్యులు, డాక్టర్ విశ్వనాథాచారి పాల్గొన్నారు.

న్యూఢిల్లీ సైనిక్ క్యాంపులో అమలాపురం యువకుడు



జావేద్ హుస్సేన్‌ను అభినందిస్తున్న సుబ్బరాజు తదితరులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎన్‌సీసీ క్యాడెట్ న్యూఢిల్లీలోని సైనిక్ క్యాంపులో పాల్గొనడం ఒక కల అని అమలాపురం ఎస్కేబీఆర్ ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు అన్నారు. అటువంటి క్యాంపులో తమ కళాశాల విద్యార్థి జావేద్ హుస్సేన్ పాల్గొనడం అభినందనీయమన్నారు. కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఆర్మీ క్యాడెట్ జావేద్ హుస్సేన్ పాల్గొని సైనిక్ క్యాంపు నుంచి శుక్రవారం కళాశాలకు రాగా ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఏటా ఇండియన్ ఆర్మీలోను, నేవీలోను ఉద్యోగాలు సాధిస్తుంటారన్నారు. ఇటీవల ఎన్‌సీసీ-సి సర్టిఫికెట్ సాధించిన ఇద్దరు క్యాడెట్లు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైనట్టు తెలిపారు. జావేద్ హుస్సేన్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, డీఎస్ఎన్ రాజు, పరిపాలనాధికారి ఎ.వెంకటపతిరాజు అభినందించారు.

అంతర్వేది ఆలయానికి చాగంటికి ఆహ్వానం



చాగంటికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఏసీ వరప్రసాద్

అంతర్వేది, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రవచనకార్యక్రమం నిర్వహించాలని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ శుక్రవారం చాగంటి కోటేశ్వరరావును స్వయంగా కలిసి ఆహ్వానించారు. వచ్చేఏడాది జనవరిలో సంక్రాంతి అనంతరం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఉంటుందని ఏసీ ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుల వింజమూరి రంగాచార్యులుతో కలిసి చాగంటిని ప్రత్యేకంగా జేసీ ప్రసాద్ ఆహ్వానించారు.

22 నుంచి దసరా వేడుకలు

అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వతేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి అక్టోబరు 2 వరకు దశమి వరకు రాజ్యలక్ష్మీతాయారమ్మవారు, అశ్వరూడాంబిక ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. పదిరోజులపాటు పూజలు జరుగుతాయని, 2వ తేదీ రాత్రి 7.30 గంటలకు స్వామికి గజవాహనంపైగ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గుర్రాలక్కమ్మ ఆలయంలో సామూహిక ఉచిత కుంకుమ పూజలను నిర్వహిస్తామన్నారు.

ఆకొండి సేవలకు గుర్తింపుగా ఉత్తమ పురస్కారం

కాట్రేనికోన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్రకళారంగంలో పదేళ్లుగా కాట్రేనికోనకు చెందిన అంజి ఆకొండి సేవలకు గుర్తింపుగా మేఘాలయ రాష్ట్రంలో ప్రజాడైరీ మాసపత్రిక వార్షికోత్సవంలో ఉత్తమ పురస్కారం లభించింది. మేఘాలయ రాజ్‌భవన్‌లో గవర్నర్ విజయశంకర్ ఈ పురస్కారాన్ని అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో నటుడు రాజేంద్రప్రసాద్, చిత్రకళారంగంనుంచి కళాసాగర్ ఎల్లపు ఉన్నారు. ప్రజాడైరీ వ్యవస్థాపకుడు సురేష్ పాల్గొన్నారు.



మేఘాలయ గవర్నర్ విజయ శంకర్ నుంచి పురస్కారం అందుకుంటున్న అంజి ఆకొండి

కాకినాడ

మరిడమ్మ అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారిని ఆలయ మండపంలోని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి బంగారు, వెండి పుష్పాలతో అర్చన చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖరులు



సామర్లకోటలో...



పెద్దాపురంలో (పైన),,, తాళ్లరేవులో (కింద)

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్



పిఠాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలో దస్తావేజు లేఖరులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పెన్‌డౌన్ పాటించడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు స్తంభించాయి. ఈ విధానం వలన తమకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని, ఓటీపీలు బహిర్గతం చేయడానికి ప్రజలు సంకోచిస్తున్నారని లేఖరులు తెలిపారు. ఆటోమ్యుటేషన్ విధానం మంచిదే అయినప్పటికీ శాఖల మధ్య సమన్వయలోపంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఇందులో లోపాలను సవరించాలని కోరారు. ఆందోళనలో పిఠాపురం దస్తావేజు లేఖరుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాల్యాల సీతాపతిరావు మాట్లాడుతూ శనివారం కూడా నిరసన కొనసాగిస్తామని చెప్పారు. వారికి సామర్లకోట, పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామ సర్వేయర్లు సంపూర్ణ మద్దతు తెలిపారు. పేకేటి రమేష్, సూతి వెంకట్, గోగు అప్పారావు, షేక్‌లాల్, పేకేటి రాజా, పేకేటి చిరంజీవి, గొంచాల బాబు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు దస్తావేజు లేఖరుల సంఘం సభ్యులు పెన్‌డౌన్ చేశారు. లేఖర్లు కాట్నం పద్దరాజు, రామకృష్ణ, దంగేటి కృష్ణ, విత్తనాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ ప్రారంభించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. ఆందోళనలో పలువురు దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీఏ ఫీడర్‌లో అన్ని 11 కేవీఏ ఫీడర్ల వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. పాత ఎమ్మార్వో కార్యాలయ ప్రాంతం, కుమ్మరి వీధి, గణేష్ కాలనీ, సీతారామ దళిత కాలనీ, బళ్ల మార్కెట్, వీర్రాఘవపురం, తెలుకులపుంత, పెన్షన్ లైన్, ప్రభుత్వ హాస్పిటల్ రోడ్డు, మఠం సెంటర్, గోలివారి వీధి, మెహెర్ కాంప్లెక్స్, ఇస్మాయిల్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కాకినాడ రోడ్డులోని పెద్దాపురం వాటర్ వర్క్స్, సామర్లకోట వాటర్ వర్క్స్, భీమేశ్వరస్వామి గుడి, టిడ్కో గృహ సముదాయం, శంకర్ లే-ఔట్స్, కోదండరామపురం, జల్లూరు డోర్స్ కంపెనీ, నిమ్మతోట, కొత్తూరు వీధి, స్టేషన్ సెంటర్, సంపంగి తోట, సత్యనారాయణపురం, మాజేటి నగర్, ఏడీబీ రోడ్డు, బీఎస్‌ఆర్ సైట్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏడీఈ కిరణ్, ఏఈ నాగేశ్వరరావు చెప్పారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. గొల్లప్రోలు, చేబ్రోలు, ఉప్పాడ, మూలపేట, కందరాడ సబ్ స్టేషన్ల పరిధిలో కరెంటు సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



సామర్లకోట ఓవర్ బ్రిడ్జిపై గోతులు పూడుస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రాఫిక్ పోలీసుల చొరవతో ఓవర్ బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు

సామర్లకోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'సామర్లకోటలో ట్రాఫిక్ ఇక్కట్లు' పేరిట శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు స్పందించారు. సామర్లకోట మీదుగా సాగరమాల రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్‌కు సమస్యను వివరించి తాత్కాలికంగా గోతులు పూడ్చడం ద్వారా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని వివరించారు. దీంతో ప్రభాకర్ కనస్ట్రక్షన్స్ సత్వరం స్పందించి 25 మంది సిబ్బందితో కాంక్రీట్ మిక్సర్, రోలర్‌లతో శుక్రవారం గుంతలు పూడ్చివేత పనులు చేపట్టి సాయంత్రానికి పూర్తి చేసింది. చొరవ చూపిన ట్రాఫిక్ ఎస్ఐ, పోలీసులను పలువురు వాహనచోదకులు, ఆటో డ్రైవర్లు అభినందించారు. అడిగిన వెంటనే రోడ్డు గుంతలను పూడ్చేందుకు శ్రమించిన సాగరమాల రోడ్డు కాంట్రాక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగాలొచ్చిన వేళ... అపూర్వ సన్మానం



ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపవరం గ్రామ పూర్వ విద్యార్థులు పురం అరుణ్‌కుమార్ ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా, రాగం రాజ్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా, పోలవరపు అజయ్ ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు పొందారు. శుక్రవారం వారిని వారు విద్యాభ్యాసం చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు సన్మానించి అభినందించారు. సర్పంచ్ మాధవరావు, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, హెచ్‌ఎం వెంకన్నబాబు, ఉపాధ్యాయులు ఆశాలత, దుర్గాదేవి, చిన్న, ఎస్ఎంసీ చైర్మన్ రత్నంరాజు, అర్జున్, సుధాకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో రేపు చిత్రలేఖనం పోటీలు

పెద్దాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన రచించిన దేశమును ప్రేమించుమన్నా దేశభక్తి గీతంలోని అంశాల ఆధారంగా ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్ తెలిపారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు సబ్ జూనియర్స్, 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్స్, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్స్, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు సూపర్ సీనియర్స్. ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోటీలు జరుగుతాయని, అనంతరం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు.



ర్యాలీలో పాల్గొన్న ఏఎంవో జగన్‌మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధూమపాన వ్యతిరేక ర్యాలీ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, విద్యార్థులు 'ధూమపానం వద్దు, ఆరోగ్యమే ముద్దు' అని నినదిస్తూ పాఠశాల సమీపంలోని వీధుల్లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి వి.జగన్మోహన్, కాకినాడ అర్బన్ ఎంఈవో చెవ్వూరి రవి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా టోఫెల్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, టీచర్లు పాల్గొన్నారు.

'ఆటో, క్యాబ్ వాహన డ్రైవర్లకు సహాయం గడువు పొడిగించాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్ వాహన డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా సహాయం కోసం నమోదు చేసుకునే గడువును మరో వారం పొడిగించాలని సీఐటీయూ నగర సహ కన్వీనర్ పలివెల వీరబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల్లో నమోదు కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిందని, సర్వర్ సమస్య, జనం రద్దీ కారణంగా నమోదు ప్రక్రియ ఆలస్యమై అందరూ నమోదు చేసుకోలేకపోయారన్నారు. నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

సంప్రదింపులు లేకుండా దసరా సెలవుల్లో మార్పులు బాధాకరం

యూపీఈఐఎఫ్ ఫౌండర్, రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్



కాకినాడ సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంప్రదింపులు లేకుండా దసరా సెలవుల్లో మార్పులు చేయడం బాధాకరమని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) ఫౌండర్, రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం అశోక్ నగర్‌లోని ఎంఎస్ఎన్ పాఠశాలలో జరిగిన ప్రైవేట్ విద్యా సంస్థల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లా డారు. విద్యా శాఖ సెలవులపై కంటే విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో దృష్టిసారిస్తే ఏపీ దేశంలోనే అగ్రగామిగా నిలిచే అవకాశం ఉంటుందని సూచించారు. దసరా సెలవుల విషయం చర్చకు రాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఇచ్చిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల ప్రణాళికలు రూపొందించగా, ఇప్పుడు ఇలాంటి నిర్ణయం ప్రకటించడంతో షెడ్యూల్ మొత్తం మారుతోందని సభ్యులు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే టప్పుడు ప్రైవేట్ విద్యా సంస్థల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని విద్యా శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కొప్పవరంలో 'ప్రజా దర్బార్'



ప్రజా దర్బార్‌లో సమస్యలు వింటున్న టీడీపీ నాయకులు

సామర్లకోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొప్పవరంలోని ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలకు చెందిన 31 అర్జీలు స్వీకరించి వాటిలో 5 అర్జీలను వెంటనే పరిష్కరించినట్టు కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. 26 అర్జీలను ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపామన్నారు. కార్యక్రమంలో పెంకే శ్రీనివాస్‌బాబా, ఆనంద్‌న్యూటన్, చింతపల్లి అర్జున్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ముత్యాల అనిల్, జున్నూరు బాబీ, సిరియాల కొండబాబు, కాకరపల్లి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పి.తిమ్మాపురంలో లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య అవసరాల నిమిత్తం పిఠాపురం మండలం పి.తిమ్మాపురం, జములపల్లి గ్రామాల్లో నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు, అంబటి మూర్తి, బర్ల అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ హ్రీం పీఠంలో నవదుర్గా యాగం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఏపీఎస్పీ వారాహి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని నవదుర్గలు విశేషాలంకరణలో రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్టు హ్రీం పీఠం వ్యవస్థాపకుడు ఈశ్వర్‌నాథ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలంలో జరిగే విధంగా తొలిసారిగా ఇక్కడ నవదుర్గలైన శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. నవదుర్గా యాగంలో భాగంగా చండీ నవావరణ మంత్ర హోమంతో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సనాతన పద్ధతిలో లోక కల్యాణార్థం నిర్వ హించే ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని వారాహి అమ్మవారితో పాటు నవదుర్గల ఆశీస్సులు పొందాలని కోరారు. అక్టోబరు 2న విజయదశమిని పురస్కరించుకుని మహాన్నదానం నిర్వహిస్తామని చెప్పారు.



పెద్దాపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

రెండో రోజుకు వీఆర్‌ఏల దీక్షలు

పెద్దాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్‌ఏల నిరసన రెండో రోజుకు చేరుకుంది. సంఘ నాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం ఇవ్వాలంటూ వీఆర్‌ఏలు తహసీల్దారు కార్యాలయం వద్ద రెండో రోజైన శుక్రవారం దీక్ష కొనసాగించారు. వారికి పలువురు సంఘీభావం తెలిపారు. సంఘ అధ్యక్షుడు యండమూరి శేషయ్య మాట్లాడుతూ ఈ నెల 22న కాకినాడలో చేపట్టే ధర్నాకు మండలంలోని వీఆర్‌ఏలంతా తరలి రావాలన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద వీఆర్‌ఏల దీక్ష రెండో రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వీఆర్‌ఏల సంక్షేమ సంఘం కొత్తపల్లి మండల శాఖ సభ్యులు చెప్పారు.

'మహిళల ఆరోగ్యం కుటుంబానికి శ్రేయస్కరం'

పెద్దాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా శ్రేయస్కరంగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌కి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసి గుర్రాల సెంటరు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు. తిరుపతి గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి ప్రారంభించారు.

'పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టిసారించాలి'

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు సూచించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరులుగా మారతాయని చెప్పారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వీధి దీపాలు అన్ని వెలిగేలా చూడాలని, పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణం తొలగించాలి'



పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న కొవ్వూరు సర్పంచ్, ఉప సర్పంచ్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పంచాయతీ పరిధిలోని మణికంఠ నగర్‌లో పంచాయతీ ఆమోదించిన పార్కు స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపట్టారు. గతంలో కూడా ఈ పార్కు స్థలంలో కొంతమంది అక్రమంగా పాకలువేయగా అధికారులు అప్పట్లో వాటిని తొలగించారు. ఆ స్థలంలో ఎవ్వరూ ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరిస్తూ పంచాయతీ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఆక్రమించి రేకులతో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి సర్పంచ్ పి.చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు, పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీ శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కార్యదర్శి వరలక్ష్మిని వివరణ కోరగా.... ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటానని చెప్పారు.



వన్నెపూడి ఎస్సీ కాలనీ నుంచి పంట పొలాల మీదుగా మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

శ్మశానవాటికకు దారి లేక ఇక్కట్లు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడి ఎస్సీ కాలనీ శ్మశానవాటికకు దారి లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాల కోసం మృతదేహాన్ని పంట పొలాల మీదుగా తీసుకువెళ్లాల్సి వస్తోందని కాలనీ వాసులు తెలిపారు. వర్షం పడితే తీవ్ర ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికకు దారి కల్పించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.

2న దుర్గమ్మ, సత్తెమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ

పిఠాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ, సత్తెమ్మ తల్లి ఆలయాల్లో వచ్చే నెల 2న విజయదశమి పర్వదినాన విగ్రహ ప్రతిష్ఠలు జరగనున్నాయి. సంబంధిత ఆహ్వాన పత్రికలను శుక్రవారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, బీజేపీ ఇన్‌చార్జి గండి కొండలరావు ఆవిష్కరించారు. ఆలయ నిర్మాణకర్త, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, బండి రవి, కావాడి పోశయ్య, పోలిశెట్టి శేఖర్, గాది కోటేశ్వరరావు, సూరంపూడి బాలు, తేజ, గౌతు రాజా, గీతా, సతీష్, రామ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మహా కవి బోయి భీమన్నకు నివాళి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాహిత్య రంగంలో ప్రజా సాహిత్యాన్ని సృష్టించిన మహా కవి బోయి భీమన్న అని రిటైర్డు డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు అన్నారు. బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోయి భీమన్న జయంతిని పురస్కరించుకుని బోట్ క్లబ్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అడబాల రత్నప్రసాదరావు, దాసరి శ్రీధర్, శిరీష, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ నాలుగో దఫా అడ్మిషన్లకు నోటిఫికేషన్

తునిరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఐటీఐ 4 అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎంప్లామెంట్ ట్రైనింగ్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా నోబెల్ ఐటీఐ వ్యవస్థాపకులు సత్యనారాయణ మాట్లాడుతూ పదోతరగతి తర్వాత ఇప్పటివరకు ఈ కోర్సులో చేరని వారుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈనెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

లోయర్ సీలేరులో విద్యుత్ ఉద్యోగుల దీక్ష


నిరాహార దీక్షల్లో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

మోతుగూడెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం లోయర్ సీలేరు జెన్కో ఉద్యోగస్తులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ ప్రాంతీయ చైర్మన్ వేమగిరి కిరణ్, కన్వీనర్ ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర విద్యుత్ జేఏసీ పిలుపుమేరకు దశలవారీగా నిర సన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. విద్యుత్ ఉద్యోగస్తులు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే అందించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమా ండ్ చేశారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి రిటైర్ ఉద్యో గులకు పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీని వెంటనే అమలు చేయాల న్నారు. దీక్షలో కూర్చున్నవారు సతీష్ రాఘవన్, పిల్లి కృష్ణారావు, వెంకటేశ్, సన్యాసిరావు, ఈశ్వరి, వేపకాయల శీను, కొట్టు శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు

అన్ని పంటలకు ఈ పంట నమోదు తప్పనిసరి

దేవీపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ 2025- 26కి అన్ని పంటలకు ఈ పంట నమోదు చేయించుకోవాలని దేవీపట్నం ఏవో ఎం.సత్యదేవి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలో పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరి పంట ధాన్యం అమ్ముకునేందుకు, పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం అందించే నష్ట పరిహారం పొందాలన్న, బ్యాంకుల్లో రుణాలు కావాలన్న, అన్నదాత సుఖీభవ, క్రాప్ ఇన్సూరెన్స్ ఇతర ప్రభుత్వ పథకాలు పొందాలన్న ఈ పంట నమోదు తప్పనిసరిగా పేర్కొన్నారు. ఈనెల 30తో ఈ పంట నమోదు పూర్తవుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలి'


విద్యార్థులతో భోజనం చేస్తున్న పీవో

మారేడుమిల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం తాజా ఆహారం అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలబాలికల ఆశ్రమ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలను, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించా రు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి ఏ రోజు ఏ ఆహారం అందిస్తున్నారని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణీలు ఎంత మంది ఆరా తీశారు. గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మడకం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ వైద్య శిబిరాలు ఎంతో మేలు

వై.రామవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న మహిళల ప్రత్యేక వైద్య శిబిరాలు మహిళల రుగ్మతల నివారణకు ఎంతో మేలు చేస్తాయని ఎంపీపీ ఆనందరావు, కూటమి నాయకులు గొర్లె శ్రీకాంత్, గుడ్ల త్రిమూర్తులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కళ్లు, చెవి, ముక్కు, గొంతు, దంత, పెడియాట్రిక్, జనరల్, గైనకాలజీ విభాగాలకు సంబంధించిన నిపుణులు 182 మందికి పరీక్షలు జరిపి ఉచితంగా సేవలందించారు. అలాగే క్యాంప్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు బ్లడ్ డొనేట్ చేశారు. కార్యక్రమంలో రంపచోడవరం నుంచి వైద్యులు డాక్టర్ బిబి మోమీనా, లక్ష్మీసృజన, ఏపీ కాంతికిరణ్, అడ్డతీగల నుంచి ఎం.అనూషదాస్, స్థానిక వైద్యులు వి.జీవన్, శ్రీహరి, సంతోష్, చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యులు, టీడీపీ మహిళా అధ్యక్షులు రామలక్ష్మి, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలవరం ప్యాకేజీ అవినీతిపై సీబీసీఐడీ విచారణ చేపట్టండి

దేవీపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న భూ కుంభకోణాలు, ప్యాకేజీ అవకతవకలు, నాన్ ట్రైబల్స్ అధికారులు కలిసి చేసిన స్కామ్‌లపై జాతీ య మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతికి ఆదివాసీ నాయకులు తీసుకెళ్లారు. పోలవరం నిర్వాసిత పునరావాస కాలనీని సందర్శించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, తెల్లం శేఖర్, కోండ్ల సాయిరాంరెడ్డి, అరగంటి వీరభద్రరెడ్డి, మడకం బంగారుబాబు, మడి అప్పన్నదొర కలిసి సమస్యలు విన్నవించారు. పోలవరం ప్యాకేజీ అవినీతిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రేపు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్యశిబిరం

రంపచోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద తెలిపారు. వైద్యశిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు నిర్వహిస్తారని, గుండె, ఆయాసం, దడ, బీపీ, షుగరు, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పాటు స్త్రీలు, పిల్లల వ్యాధులకు వైద్య నిపుణులతో వైద్య సేవలు అందిస్తారన్నారు.వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, కళ్లజోళ్లు అందజేయనున్నట్టు తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్, తెల్లరేషన్ కార్డులను తీసుకురావాలన్నారు.

వీఆర్‌ఏల వేతనం రూ.26వేలు చెల్లించాలి

రంపచోడవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయాల్లో పనిచేస్తున్న వీర్‌ఏలకు కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని వీఆర్‌ఏల సంఘం అధ్యక్షురాలు తుర్రం చింతాలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దారు బాలాజీని కలసి వినతిపత్రం అందజేశారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, సోమవారం పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు బి.హర్షవర్ధన్, అన్నిక బాపనమ్మ, పి.దేవమణి, కారం మల్లమ్మ, ఎస్.అనురాధ, కుంజం పోశమ్మ, కొనుతూరి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రక్తదానం శిబిరం

ఎటపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న పక్షోత్సవంలో భా గంగా శుక్రవారం నెల్లిపాక పీహెచ్‌సీలో బీజేపీ మండలా ధ్యక్షుడు నలజాల శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంను నిర్వహించారు. భద్రాచలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈకార్యక్రమంను నిర్వహించా మన్నారు. యువకులు, స్థానికులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. డాక్టర్ దుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు సతీష్‌నాయక్, దుర్గారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎటపాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎటపాక 132బై33కేవీ సబ్‌స్టేషన్ నుంచి పురుషోత్తపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు లైన్ల పరిధిలో ఉన్న చెట్ల కొమ్మలను తొల గించే క్రమంలో నేడు ఎటపాక, కనాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, రాయనపేట, గుండాల, వెంకట రెడ్డిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ గాబ్రియల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

వైద్యశిబిరాలు మహిళలకు ఎంతో ఉపయోగకరం

» స్వస్త నారి-స్వశక్త్ పరివార అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.రాగంపేటలోని జగ్గంపేట సీహెచ్‌సీలో స్వస్తనారి-స్వశక్త్ పరివార అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోకరమని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్, వైద్యసిబ్బంది, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావు, ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రంకి రాంబాబు, కొత్త కొండబాబు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో..

మండలంలోని మల్లేపల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో స్వస్తనారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా క్యాన్సర్ నివారణపై మహిళలకు వైద్యులు అవగాహన కల్పించారు. క్యాన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయని, ఆలస్యంగా గుర్తించడంవల్ల స్టేజ్ దాటిపోతోందని తెలిపారు. పలువురు మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు ఉన్నారు.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి పంచాయతీ కార్యాలయంలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన శుక్రవారం స్వస్తనారీ-స్వశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలతా రాంబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన మహిళలకు నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. క్యాంప్‌లో ఐసీడీఎస్ తరుపున సీడీపీవో ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశా రు. వైద్యురాలు సాయిహేమాంజలి, సీహెచ్‌ఓ జ్యోతి, పీహెచ్ఎన్ కాశీఅన్నపూర్ణ,హెచ్ఎస్ రమణమూర్తి, హెచ్‌వీ అనంతలక్ష్మి, గణపతి, ఏఎన్ఎం దేవి, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ జి.సునీత, బి.మెర్సి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గండేపల్లి మండలం జె.రాగంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

'మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తిసుశీల అబ్బాయి తెలిపారు. పంచాయతీ కార్యాలయంవద్ద ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వై.గీతాసుధ, ఐసీడీఎస్ సీడీపీవో టీవీఆర్ పద్మావతి మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. చిన్నారుల బాల్యదశ సంరక్షణ, సమగ్ర పోషణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారు వివరించారు. సొసైటీ అధ్యక్షుడు దాసంశేషారావు, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు,బొల్లువెంకటేశ్వరరావు, ఊటా వీరబాబు కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనాపల్లి, మర్రివీడుల్లో స్వస్థ నారీ-స్వశక్తపరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్ ఈశ్వరరావు, టీడీపీ నాయకులు సత్యరానారాయణ, చిన్న పాల్గొన్నారు.


కిర్లంపూడిలో క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

దేవదాయశాఖ పరిధిలోకి సీతంపేట దుర్గామీనాక్షి ఆలయం

శంఖవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో దుర్గామీనాక్షి అమ్మవారిగా విరాజిల్లుతున్న ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయశాఖ పరిధిలోకి తీసుకుంటున్నట్లు ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. 45ఏళ్లుగా సీతంపేట కొండపై దుర్గామీనాక్షి అమ్మవారిగా పూజలందుకుంటూ శుక్ర, మంగళవారాల్లో పరిసర ప్రాంతాలనుంచి భారీస్థాయిలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక్కడి ఆలయ కమిటీ సభ్యులు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. తహసీల్దారు కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, నేతలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అమ్మవారికి చెందిన ఆస్తులను ప్రభుత్వానికి సమర్పించారు. ఆలయ ఈవోగా యర్రా వెంకటేశ్వరావును నియమించినట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వం ఆలయ కమిటీని ప్రకటిస్తుందన్నారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, బద్ది రామారావు, బద్ది రమణ, వెన్నా శివ, కీర్తి సుభాష్, కోయ్యా రమణ, కంచిబోయిన శ్రీను పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం తర్వాత అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపాలు పఠించారు. 11 గంటలకు హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాల తర్వాత తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుడి సన్నిధిలో అయోధ్య రామజన్మభూమి ట్రస్టీ పూజలు


అయోధ్య రామజన్మభూమి ట్రస్టీకి స్వాగతం పలుకుతున్న ఈవో

అన్నవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం అయోధ్య రామజన్మభూమి ట్రస్టీ విశ్వప్రసన్న తీర్థస్వామి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు, అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో సాంకేతికతలపై రెండో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేటివ్ సస్టైన బుల్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీపై రెండో అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ రెండురోజుల అంతర్జాతీయ సదస్సు 19, 20తేదీల్లో హైబ్రిడ్ మోడ్‌లో(ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో జరుగుతోంది. ఎన్ఐటీ సివిల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆరిఫ్ అలీ సుస్థిర, తక్కువ కార్బన్, స్మార్ట్ మెటీరియల్స్ భవిష్యత్తు దిశపై ప్రధానంగా ప్రసంగించారు.

వీఆర్‌ఏల ఆందోళన

ఏలేశ్వరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు పేస్కేల్ అమలు చేయాలని, నామినీలకు వీఆర్‌ఏలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయంవద్ద ఆందోళన చేపట్టారు. ఈనెల 20న ఆర్డీవో కార్యాలయం, 22న కలెక్టరేట్‌వద్ద ధర్నా చేస్తామన్నారు. షేక్ దాదా సాహెబ్, కొత్తపల్లి సత్తిబాబు, పొట్లాడ రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

» అసెంబ్లీలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయానికి అతికీలకమైన అంశం ఇరిగేషన్ ప్రాజెక్టులుఅని, రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులకు రూ.97వేలకోట్లు అవసరమని ఆ నిధులు సమకూర్చి పూర్తి చేయగల సమర్థత, సత్తా ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని ఆయన నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టు సహా అన్నీ పూర్తవుతాయన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో నాలుగు ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయగలిగామని, తాళ్లూరు లిఫ్ట్ పూర్తిగా పైప్‌లైన్లు పాడవడంతో ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అప్పటి సీఎం జగన్ పూర్తిగా పక్కన పెట్టారన్నారు. సీఎం చంద్రబాబుకి, జగన్ రెడ్డికి వ్యత్యాసం ఇదేనన్నారు. తాళ్లూరు లిఫ్టుకు సీఎం చంద్రబాబు రూ.52కోట్లు కేటాయించి క్యాబినెట్ ఆమోదం చేయించి వర్క్ ఆర్డర్ ఇప్పించారని, మల్లవరం ఎత్తిపోతల పథకానికి రూ.140కోట్ల నిధులు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం చేయించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.

జగ్గంపేటలో ఫ్రైడే-డ్రైడే

జగ్గంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. ప్రతి శుక్రవారం రోజు మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజూ మన చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సీతానగరంలో మురికి కాలువ పరిశుభ్రంగా ఉండేలా పనులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పాండ్రంకి రాంబాబు, దేవరపల్లి మూర్తి పరిశీలించారు. జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

'మహిళల ఆరోగ్య భద్రతకు పెద్దపీట'

తొండంగి,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యభద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. కృష్ణాపురంలో స్వస్థ్ నారీ-స్వశక్త్ పరివార్ ఆరోగ్యశిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలను ముందే గుర్తిం చి భవిష్యత్‌లో వారు తీవ్రమైన అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు ప్ర భుత్వం ఈ పథకం ద్వారా చర్యలు తీసుకుందన్నారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళకు ఉచితంగా పరీక్షలు జరిపి మందులు అందిస్తోందన్నారు. సర్పంచ్ కందా శ్రీధర్, పంపా నీటి సంఘం అధ్యక్షులు చందు, అరిగెల నర్సింహమూర్తి, వెన్నా మురళీ కృష్ణ, నేమాల కృష్ణ పాల్గొన్నారు.

యనమలను కలిసిన అక్షయ పాత్ర ప్రతినిధులు

తుని రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మాజీమంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం, విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలను యనమలకు వివరించారు. అక్షయ పాత్ర రీజనల్ ప్రెసిడెంట్ భక్తదాస ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది.

ఆర్టీసీ డీఎంకు సత్కారం

ఏలేశ్వరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలేశ్వరం ఆర్టీసీ డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచేందుకు కృషి చేసిన అవార్డు గ్రహీత డిపో మేనేజర్‌ను వీహెచ్‌పీ సభ్యులు ఘనంగా సత్కరించారు. విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో శుక్రవారం డిపో ఆవరణలో మేనేజర్ జీవీ సత్యనారాయణ దంపతులను శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మాన పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. అలమండ దుర్గా వెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కటకం కిరీటి, ఇందిర, లక్ష్మీ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో క్యాన్సర్‌పై అవగాహన

గండేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయయం ఎస్ఎస్ఎస్ యూనిట్, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో గర్ల్ స్టూడెంట్స్ కోసం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ పి.అనూష విద్యార్థినులకు క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతపై సూచనలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్, డీన్ డాక్టర్ డి.కిషోర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రౌతులపూడి,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో టీడీపీ మద్దతురాలు, పదో వార్డు మాజీ మెంబర్ నిడిగట్ల లక్ష్మి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈనెల 4న రౌతులపూడి గ్రామ శివారు ఏటికాలువ సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వచ్చి ఆమెను బలంగా ఢీకొన్నాడు. బలమైన గాయం కావడంతో ఆమె ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కోమాలోకి వెళ్లిన లక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. లక్ష్మి మృతికి టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

'యూరియా వాడకం తగ్గించుకోవాలి'

కోటనందూరు,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):రైతులు యూరియా వాడకం తగ్గించుకుని నానో యూరియా వాడాలని ఏఈవో జగ్గఅప్పారావు సూచించారు. జగన్నాథపురంలో రైతులు, స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూరియా వాడకం తగ్గించాలని,నానో యూరియా వల్ల ఉపయోగాలు వివరించారు.

'కల్వర్టు నిర్మాణం చేపట్టండి'

శంఖవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లిపూడి శివారులో కల్వర్టు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగాఉందని, వెంటనే నిర్మాణం చేపట్టాలనిటీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు కోరారు. ఈమేరకు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో శ్రీరమణికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కత్తిపూడి నుంచి రౌతులపూడి మీదుగా భారీవాహనాలరాకపోకలు ఈ కల్వర్టు మీదుగా సాగుతున్నాయని, వెంటనే నిర్మించకపోతే కూలిపోయే ప్రమాదముందని వినతిపత్రంలో కోరారు. సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్, బద్ది రమణ, పిర్ల అప్పారావు, శివ, సుభాష్, కొయ్యా రమణ, కంచిబోయిన శ్రీను పాల్గొన్నారు.

'గ్రామాల సంపూర్ణ అభివృద్ధే ధ్యేయం'

శంఖవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే సత్యప్రభ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు టీడీపీ నేత పర్వత సురేష్ అన్నారు. వైష్ణమాన్యం, అంబేద్కర్‌నగర్‌ల్లో రూ.20లక్షల నిధులతో నిర్మాణం చేపట్టే సీసీ రోడ్లకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతంనీడి కుమార్, బొర్రా వాసు, బొర్రా ప్రసాద్, రౌతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

కిర్లంపూడి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వీఏఏ, పీపీసీ సిబ్బంది, వీఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుధామాధురి, సివిల్ సప్లయి డిపార్టుమెంట్ టెక్నికల్ అసిస్టెంట్స్ దుర్గాప్రసాద్, శ్రావణి, ప్రత్తిపాడు ఎంఎస్‌వో శిక్షణఇచ్చారు. ధాన్యం కొనుగోలుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

30లీటర్లు సారా పట్టివేత

రౌతులపూడి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా బైక్‌పై తరలిస్తున్న 30లీటర్ల సారాను పోలీసులు పట్టుకున్నారు. గ్రామశివారు మరిడమ్మఆలయ సమీపంలో సారా పట్టుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సారాతరలిస్తున్న కె.శివప్రసాద్‌ను అరెస్టు చేశామన్నారు. జ్యుడిషియల్‌రిమాండ్ నిమిత్తం తుని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

'బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి'

శంఖవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈగల అప్పారావు,నరాల శ్రీను, రామిశెట్టి ఏసుబాబు పాల్గొన్నారు.

ఏలేశ్వరం ఎంపీడీవోగా వర్మ



ఏలేశ్వరం,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా సీహెచ్ రవి కుమార్‌వర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వర్మ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఏలేశ్వరం వచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సూర్యనారాయణ పదోన్నతిపై పెద్దాపురం బదిలీపై వెళ్లారు.

ఖైదీల కేసుల కోసం ప్రభుత్వ న్యాయవాదిని పెట్టుకునే అవకాశం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):ఖైదీల కేసుల కోసం ప్రభుత్వ న్యాయవాదిని పెట్టుకునే అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి చెప్పారు. శుక్రవారం సబ్‌జైలును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ ఖైదీలందరికీ న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. ఎవరైనా న్యాయవాది లేనిచో ప్రభుత్వ న్యాయవాదిని పెట్టుకునే అవకాశం ఉందని ఆమె తెలిపారు.అలాగే భోజన వసతులు, మంచినీటి సౌకర్యాలు వంటి ఉన్నా యని ఖైదీల నుంచి ఆరా తీశారు. ఫిర్యాదుల పెట్టె తెరిచి ఫిర్యాదులు ఏమీ లేకపోవడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్యానల్ అడ్వకేట్ బుగత వెంకట శివన్నారాయణ, అవసరాల దేవి, కుసుమంచి సూర్యప్రకాశరావు, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు.

జగ్గంపేట,(ఆంధ్రజ్యోతి): శనివారం 11కేవీ జగ్గంపేట-నరేంద్రపట్నం ఫీడర్, జగ్గంపేట ఇండస్ట్రీయల్ రాజపూడి ఇండస్ట్రియల్ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్ కారణంగా ఉదయం9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. బావవరం, కాండ్రేగుల గ్రామాలకు, బావవరం వాటర్ ప్లాంట్‌కి, గొల్లలగుంట, గుర్రం పాలెం గ్రామాలకు, బోరులకు విద్యుత్ సరఫరా ఉండదు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానం రద్దు చేయాలి

● ప్రత్తిపాడులో దస్తావేజు లేఖర్ల ఆందోళన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియలో ఓటీపీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంవద్ద శుక్రవారం దస్తావేజు లేఖరు లు, స్టాంప్ వెండర్లు,కంప్యూటర్ ఆపరేటర్లు అం దోళన చేపట్టారు. దస్తావేజు లేఖర్ల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శిబిరంఏర్పాటు చేసుకుని దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా రిలే దీక్షల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజులేఖర్ల సంఘ నాయకులు పంచదార్ల నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు, రాయవరపు హనుమంతురావు,మదినే వెంకన్నదొర బాబు, చిలకమర్తి వెంకటరమణలు మాట్లాడుతూ అక్రమాలకు ఆస్కారం లేని పాత విధానంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియకొనసాగాలన్నారు. ఈ ఆందోళనలో శివాజీ, పి.మచకరంగర రాంబాబు, కొట్టేటి లక్ష్మణ్, చిదిగం వెంకట రమణ, గల్లా మధు, ఎ. దొర, ఆచంట రాంబాబు, వీరన్న, ప్రకాష్, గిరి,తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

అరుణాచలేశ్వరాలయంలో మాల ధారణలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 80మంది భక్తులు భవాని మాలలు ధరించారు. మండల వ్యాప్తంగా తరలి వచ్చిన భవాని భక్తులకు సాంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు భవాని గురుస్వాములు ఈ మాల ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమణానంద స్వామి ఆధ్వర్యంలో ఆలయంలోని మహానందీశ్వరునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు


అరుణాచలేశ్వరాలయంలో 80 మంది భవాని భక్తులు మాలధారణ చేపట్టిన దృశ్యం